28 నుంచి నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



హయత్‌నగర్: వర్ధ నగర్ కాలనీ కమిటీ హాల్లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఈ నెల 2 నుంచి మూడ్రోజుల పాటు నల్ల పోచమ్మ దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్లు కాలనీ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది.వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ వంటి శాస్త్రోక్త ఆచారాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ వెల్లడించింది. మహోత్సవం సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయ అభివృద్ధి, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి భక్తులు ధన, వస్తు, రూపంలో విరాళాలు ఇవ్వాలని వర్ధనగర్ కమిటీ కోరింది.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి అగ్రికల్చర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కాలనీలో నిర్వహించిన సమావేశంలో చైర్మన్‌గా శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడిగా వి.సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.హరివర్ధన్, కోశాధికారిగా ఎస్.అల్వాల్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వి.ధర్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.వెంకట్‌రెడ్డి, టి.నిర్మల, సంయుక్త కార్యదర్శులుగా పి.మాధవరెడ్డి, కె.నాగరాజు, కె.అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అవయవదానం



సంపత్‌కుమార్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడో ఓ యువకుడు. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కంచెనపల్లికి చెందిన కొప్పోలు సంపత్‌కుమార్ (20) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎమర్జెన్సీలో ఉంచి చికిత్సను అందించారు. చికిత్సకు స్పందించకపోవడంతో ఈ నెల 4న బ్రెయిన్‌డెడ్ అయినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు సంపత్‌కుమార్ తల్లి పార్వతమ్మ, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్‌కు దానం చేశారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆర్‌కేపురం డివిజన్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం పలువురు నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెలకొండ శ్రీనివాస్ రెడ్డి, సాజీద్, గొడుగు శ్రీనివాస్, కంచర్ల శేఖర్, మహేందర్ రెడ్డి, కుమార్, మురళీదార్ రెడ్డి, దీపు, జగన్మోహన్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు .

నిధుల మంజూరుకు వినతి



నాగోలు: నాగోలు డివిజన్‌కు నిధులు మంజూరు చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ ఈటల రాజేందర్‌ను సోమవారం నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ కలిసి వినతిపత్రం అందజేశారు. రాక్‌టౌన్ కాలనీ, సర్వే నంబర్– 58, బాలాజీ నగర్ కాలనీ, చాణక్యపురి కాలనీ, అప్కో కాలనీల్లో కమ్యూనిటీ హాళ్ల లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొన్ని కాలనీలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారని, అవి పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు.

అల్లర్లు చేస్తే.. అరెస్టులే

- రాత్రి సమయాల్లో ఖాళీ స్థలాలు, లాడ్జీలపై నిఘా
- సాక్షి కథనాలకు స్పందన

సాక్షి ఎఫెక్ట్..

నాగోలు: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, రోడ్ల పక్కన నిలబడి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిపై, రాత్రి సమయంలో మద్యం మత్తులో గొడవలకు దిగుతున్న యువకులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తరచూ జరుగుతున్న దాడులు, హత్యలు, గొడవలతో ఎల్‌బీనగర్ వాసులు భయాందోళనకు గురయ్యేవారు. ఈ ఘటనలపై గతంలో సాక్షిలో 'ఎల్‌బీనగర్.. గ్యాంగ్ వార్' 'ఆధిపత్య పోరులో దాడులు.. హత్యలు' అనే వరుస కథనాలకు పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజు రాత్రి సమయాల్లో లాడ్జిలు, ఓపెన్ స్థలాలపై తనిఖీలు చేస్తూ అనుమానాస్పదంగా కనిపించిన వారిని విచారించి కేసులు నమోదు చేస్తున్నారు.





ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనం

మార్పురాకపోతే జైలుకే..

రాత్రి సమయాల్లో ఓపెన్ స్థలాలు, చెరువు కట్టలపై, పార్కుల్లో ఇతర ప్రాంతాల్లో మద్యం తాగుతూ హంగామా చేస్తున్న వారిని గుర్తించి స్టేషన్‌కు తరలిస్తున్నారు. వారి వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మొదటి సారి పట్టుబడి కౌన్సెలింగ్ తర్వాత కూడా మార్పు రాకపోతే కేసులు నమోదు చేస్తున్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించినా అకారణంగా దాడులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు హెచ్చరిస్తున్నారు.



రాత్రుల్లో ప్రత్యేక తనిఖీలు..

ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో గత నెలలో వరుస హత్యలు, గొడవలు జరగడంతో అప్రమత్తమైన పోలీసులు రాత్రి సమయాల్లో ప్రత్యేక నిఘా పెంచారు. రాత్రి సమయాల్లో అల్లరి మూకల గొడవలకు చెక్కు పెడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో లాడ్జిలు, రోడ్లపై మహిళల నిలబడి అసభ్యకర సైగలు చేస్తున్న వారిని స్టేషన్ తరలించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మార్పు రాకపోతే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో చైతన్యపురి, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన రహదారుల పక్కన, నిర్మానుష్య ప్రాంతాల్లో మహిళలు, యువతులు, ట్రాంజెండర్లు అసభ్యకర దుస్తుల్లో నిలబడి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఈ విషయం పోలీసులు ఉన్నత అధికారుల దృష్టి వెళ్లడం, ఎల్‌బీనగర్‌లో నిత్యం గొడవలు చోటు చేసుకోవడం, మద్యం మత్తులో యువకులు గొడవలకు దిగడంతో వివిధ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది రాత్రి సమయాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.



అసభ్యంగా ప్రవర్తిస్తున్న మహిళలకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మెకు సహకరించాలని వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నేతలు

మన్సూరాబాద్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. సమ్మెకు సహకరించాలని కోరుతూ ఆటోనగర్‌లోని వివిధ కంపెనీల మేనేజర్లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పని చేస్తుందని, కార్మికులకు నష్టపరిచేలా తెచ్చిన నాలుగు లెబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని 11 జాతీయ కార్మిక సంఘాలు, వివిధ రంగాల్లోని స్వతంత్ర ఫెడరేషన్లు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. మేడే అమరవీరుల స్ఫూర్తితో ఐక్య పోరాటాలను ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, సత్యనారాయణ, నరహరి, అచ్చాలు, భిక్షపతి, శ్రీనివాస్, శంకరయ్య పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలు ఆచరణీయం



కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

మన్సూరాబాద్: కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలు నేటికీ ఆచరణీయమని సీపీఐ ఎల్‌బీనగర్ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం హయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్ల్‌మార్క్స్ జయంతి వేడుకలలో శేఖర్‌రెడ్డి హాజరై మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్మనీలో జన్మించిన కార్ల్‌మార్క్స్ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక, కర్షక, పీడిత ప్రజల విముక్తికి జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. మార్క్స్ అందించిన చారిత్రక భౌతికవాదం, వర్గ పోరాట సిద్ధాంతం, కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో, దాస్ కాపిటల్ వంటి అజరామర గ్రంథాలను ప్రపంచానికి అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచీకరణ విధానాల నేపథ్యంలో పెరుగుతున్న అసమానతలు, దోపిడీకి వ్యతిరేఖంగా పోరాడటానికి మార్క్స్ సిద్ధాంతాలు అత్యంత అవశ్యకతమని, నేటి యువత మార్క్సిజాన్ని అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, అరుణ్‌కుమార్‌గౌడ్, వంశీవర్ధన్‌రెడ్డి, నాగరాజు, సుజాత, సరిత, అరుణ, సౌజన్య, అలివేణి, సుమతి పాల్గొన్నారు.

రసాయనాలతో మగ్గిస్తే కేసులు నమోదు చేస్తాం



మామిడి పండ్లను పరిశీలిస్తున్న డీడీ ప్రసాద్‌రావు

చాదర్‌ఘాట్: హైదరాబాద్ వ్యయసాయ మార్కెట్ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ మార్కెటింగ్ ప్రసాద్‌రావు నేతృత్వంలో సోమవారం జాంబాగ్ మార్కెట్‌లో మామిడి పండ్లలో రసాయనాల తనిఖీలు నిర్వహించారు. అనంతరం మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీడీ ప్రసాద్‌రావు మాట్లాడారు. మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని తెలిపారు. మామిడి పండ్ల ట్రేలలో ఇతాలిన్ కెమికల్స్ పెట్టి మగ్గిస్తున్నారని తెలిపారు. దాదాపుగా 15 ట్రేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరీక్షల్లో కెమికల్స్ వాడినట్లు వస్తే కేసులు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్–సెక్రటరి చిలుక నర్సింహా ఫుడ్ సేఫ్టీ అధికారులు సైమ్య, రాజేశ్వరి, పవన్ పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు సత్కారం



క్రీడాకారిణులను సత్కరిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: ఇటీవల ఆదిలాబాద్ మందమర్రిలో నిర్వహించిన సీనియర్ ఉమెన్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారిణులను రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సత్కరించారు. సోమవారం చైతన్యపురిలోని ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు హన్సిక, తనీషా, స్నిగ్ధలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సోలిపురం వెంకటరెడ్డి, కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, కోచ్ రణధీర్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, కార్తీక్, సల్మాన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

వనస్థలిపురం: హస్తినాపురం ఈస్ట్, పరిసర కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హస్తినాపురం ఈస్ట్ కాలనీలో కాలనీవాసులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సరిగా లేదని ఈ సందర్భంగా స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా జలమండలి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపతిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, విష్ణుమూర్తి, అనంత్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

లింక్ పంపి రూ.1. 26 లక్షలు కాజేసి

నాగోలు: ఓ మహిళకు గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో లింక్ పంపి ఆమె అకౌంట్‌లోని రూ. 1.26 లక్షలు కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మన్సూరాబాద్, వినాయక్‌నగర్ కాలనీకి చెందిన అఖిలరెడ్డికి గత నెల 4న గుర్తు తెలియని వ్యక్తి నుంచి టెలిగ్రామ్ యాప్‌తో లింక్ వచ్చింది. తమ వద్ద పని ఉందని సమాచారం ఇచ్చి ముందుగా రూ. 5000 చెల్లించాలని పేర్కొన్నారు. ఆమె వెంటనే రూ. 5 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించింది. ఈ నెల 2న మరో రూ. 36,200 చెల్లించింది. ఇలా విడతల వారీగా రూ.1.26 లక్షలు దోచుకున్నారు. మోసపోయినట్లు గ్రహించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆకతాయిలపై చర్యలు తీసుకుంటాం

చైతన్యపురి: అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ ఆగడాలకు పాల్పడే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండ్రోజుల పాటు అర్ధరాత్రి సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ అతివేగంగా బైక్‌పై నడుపుతున్న ఆకతాయిలను పట్టుకుని 25 బైక్‌లు సీజ్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అలాగే దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్న పలువురు ట్రాన్స్ జండర్లను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. కాలనీలు, బహిరంగ ప్రదేశాల్లో బర్త్‌డే పార్టీలు చేసుకుంటూ న్యూసెన్స్ చేస్తున్న 35 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

ఆకతాయిలపై 43 కేసులు నమోదు

చైతన్యపురి: అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న ఆకతాయిలపై 44 కేసులు నమోదు చేసినట్లు చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ మెయిన్ రోడ్డు, మెట్రోస్టేషన్, ఓమ్నీ ఆసుపత్రి రోడ్డు, కొత్తపేట రహదారిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్లపై తిరుగుతున్న 39 మంది, లైసెన్స్‌లు, సరైన వాహన పత్రాలు లేని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో అయిదుగురిపై బూజింగ్ కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు.

స్మార్ట్ అంగన్‌వాడీ ఏర్పాటు అభినందనీయం



అంగన్‌వాడీ చిన్నారులతో రెజినా

చాదర్‌ఘాట్: సాధారణ అంగన్‌వాడీ కేంద్రాన్ని చిన్నారుల మేధో అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేసి స్మార్ట్ అంగన్‌వాడీగా తీర్చిదిద్దటం అభినందనీయమని సినీనటి రెజినా కసాండ్రా అన్నారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలోని మలక్‌పేట అంగన్‌వాడీ కేంద్రాన్ని రేస్ టు విన్ ఫౌండేషన్, హైదరాబాద్ రేస్ క్లబ్‌తో కలిసి దత్తత తీసుకుని ఆధునీకరించారు. ఈ స్మార్ట్ అంగన్‌వాడీని సోమవారం రెజినా కసాండ్రా, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వై.గోపిశెట్టితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి రేస్ టు విన్ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు.

పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా



నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎస్‌కే మొహమ్మద్

నాగోలు: సమాజ సేవకులు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా జన్మదినం సందర్భంగా సోమవారం నాగోలులోని తన క్యాంపు కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీనివాస గుప్తా అభిమానులు, బంధుమిత్రులు పాల్గొని రక్తదానం చేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదానం చేసిన దాతలను శ్రీనివాస గుప్తా అభినందించారు.

- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మైనార్టీ నాయకులు ఎస్ మొహమ్మద్ ఆధ్వర్యంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను కలిసి సన్మానించి పేద విద్యార్థుల కోసం నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటికొండ రాఘవేంద్ర గుప్త, బోయ శివకుమార్, గట్టు పురపోత్తం, డప్పు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.21, దొండ రూ.25.

జలమండలి జీఎంకు వినతి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి నాగార్జున కాలనీ, క్రిస్టియన్ కాలనీ, హస్తినాపురం ఈస్ట్, రాజిరెడ్డినగర్‌లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు సోమవారం జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో తరచూ తాగునీటి సరఫరా సరిగా లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కొత్త రవిందర్‌గౌడ్, తడకమళ్ల విజయ్‌కుమార్, సత్తయ్య, శంకర్‌గౌడ్, రవికుమార్, రామాంజనేయులుగౌడ్ ఉన్నారు.

ఆన్‌లైన్ మెడిసిన్ డెలివరీని ఉపసంహరించుకోవాలి

మన్సూరాబాద్: ఆన్‌లైన్ మెడిసిన్ డెలివరీకి కేంద్ర ప్రభుత్వం వెలువరించిన అత్యవసర గెజిట్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ది తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, కోశాధికారి రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ.. కరోనా సమయంలో జారీ చేయబడిన గెజిట్ ఉత్తర్వులతో దేశవ్యాప్తంగా ఉన్న కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్‌లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, కేంద్ర హెల్త్ సెక్రెటరీను కలిసి గెజిట్ దుర్వినియోగంపై వివరించడం జరిగిందన్నారు. కేంద్రం విడుదల చేసిన గెజిట్‌తో హేతుబద్ధం కాని మాదక ద్రవ్యాల వాడకం పెరిగే ప్రమాదం ఉందని, నకిలి, నాసిరకం మందులు పెరుగుతాయని, ఔషధ నిరోధకతతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని, డ్రగ్స్, కాస్మెటిక్, ఫార్మసీ చట్టాల ఉల్లంఘన జరుగుతుందని వివరించినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



నాగోలు: కొత్తపేట డివిజన్ వివిధ కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ జలమండలి జీఎం బలరామ్ కలిసి వివరించారు. శ్రీశంకర్ కాలనీ, భరత్ నగర్ ఫేస్–2, శివగంగకాలనీ, మారుతినగర్, మోహన్ నగర్ విలేజ్‌తో ప ఆటు వివిధ కాలనీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా వేధిస్తుందని వివరించారు. కాలనీల్లో పాత డ్రైనేజీ లైన్ కావడంతో నత్యం మురుగు రోడ్లపైన పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలలో నూతన డ్రైనేజీ లైన్ల కోసం గుంతలు తవ్వి పనులు పూర్తవగానే మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పలు కాలనీల్లో డ్రైనేజ్ మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జీఎం హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.